మినీ కథ

# ట్రిక్..ట్రిక్..ట్రిక్..



జి. రంగబాబు

హేమ కాలేజి బ్యూటీ! ఆ కాలేజీలోని స్టూడెంట్స్ందరికీ ఆమె హృదయరాణి. ఆమె కన్నెత్తి చూస్తేనే జన్మ ధన్యమైనట్లు భావిస్తారు! ఒక్క సారి పలకరిస్తే చాలు పొంగిపోతారు! లెక్చరర్స్ సైతం ఆమెతో మాటకలపాలని కుతూహలపడతారు!

అటువంటి హేమ ఆ రోజెందుకో డల్‌గా వుంది!, ఒంటరిగా లేడీస్ వెయింటింగ్ రూము లో కూర్చుని ఏదో ఆలోచిస్తోంది! అంతలో ఆమె ఫ్రెండ్ కవిత వచ్చి పలకరించింది!

"హాయ్ హేమా! ఏమిటా ఫోజు? జీవితంలో సర్వం కోల్పోయినదానిలా! రేపు నీ బర్త్‌డే అనుకుంటా! ఆ ఏర్పాట్లేవో చూడకుండా ఇలా ఒంటరిగా కూర్చున్నావేమిటి? ఆ హిస్టరీ లెక్చరర్ గాని ఏమన్నా అన్నాడా ఏమిటి కొంప తీసి?"

"ఆ వాడిబొంద వాడికి నన్ననే ధైర్యం ఎక్కడిది? నన్ను చూస్తేనే గుడ్లప్పగించి నిలబడి పోతాడు, నోటమాటరాని వాడిలా! నా దిగులల్లా రేపు రాబోయే నా బర్త్‌డే గురించేనే ప్రతి ఏడాదీ మన ఫ్రెండ్సందరికీ నా బర్త్‌డే సదర్భంగా ఏదో ఒక ప్రెజెంట్ ఇవ్వడం పరిపాటి అయింది కదా సమయానికి నావద్ద డబ్బు లేదు, వారి ప్రెజెంట్స్ సంగతేం చేయాలో పాలుపోవడం లేదు. నీ దగ్గరేమైనా వుంటే సర్దవే ఎం.ఓ. రాగానే ఇచ్చేస్తాను, ప్లీజ్...!" అంది హేమ.

"సారీ హేమా! నా దగ్గర కూడా డబ్బు లేదు. మొన్ననే మార్కెట్‌లోకి లేటెస్ట్ డిజైన్ శారీ ఒకటి వస్తే వెనక, ముందూ ఆలోచించకుండా వెంటనే కొనేశా ఇప్పుడెలా? అయినా నువ్వు నోరు తెరచి అడగలేగాని కాదనే నాధుడువ్వాడా, ఈ కాలేజీలో? నువ్వు ఊ అను నిముషాల మీద అప్పుపుట్టించేస్తాను ఏమంటావ్?" అంది ఆవేశంగా కవిత

"అప్పు అప్పుచేయడం నా పాలసీకి విరుద్ధమని నీకు తెల్సుగా అప్పుచేసి పార్టీ ఇస్తే అందరికీ చులకనైపోనూ మరేదైనా మార్గం చూడవే బాబూ నీకు పుణ్యం వుంటుంది" అంటూ ప్రాధేయపడింది హేమ.

దానికి కవిత "సరే సరే నువ్వంతగా ప్రాధేయపడుతున్నావు కాబట్టి నీ సమస్య తీరిపోయే మార్గం ఆలోచించి రేపటిలోగా నీకు ఆ ప్రెజెంట్స్ ఏవో ఏర్పాటు చేస్తాను నన్ను నమ్ము ఇక నువ్వు హాయిగా నిద్రపో మరి ఈ సహాయం చేస్తున్నందుకు రాణీగారికి లంచం ఓ కప్పు కాఫీ మరి వెంటనే ఇప్పించుకో"

"సరేలేవే నీ కాఫీ గొడవ ఎప్పుడూ వుండేదేగా రోజుకు పది కప్పులైనా తాగందే వుండలేవుగా ఒక్క కాఫీయేం ఖర్మ? టిఫిన్ కూడా తిను నా సమస్య గట్టెక్కిస్తే అంతే చాలు" అంటూ కేంటిన్ వైపు దారితీసారు హేమ, కవితలు.

* * * * *

"హలో హేమా మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!"

"థాంక్యూ థాంక్స్ ఎ లాట్" అంది హేమ తన ఫ్రెండ్స్ చెప్పిన బర్త్‌డే గ్రీటింగ్స్ అందుకొని!

అంతలో కవిత వచ్చి హేమకు గ్రీటింగ్స్ చెప్పి "హేమా నువ్వెంత ముద్దొస్తున్నావో తెలుసా?" అంటూ చేతులతో చుట్టేసింది హేమ ఆ రోజు రోజూకంటె ఎక్కువగా అలంకరించుకొందేమో అజంతా శిల్పసుందరిలా మెరసి పోతోంది. పార్టీకి వచ్చిన వారు తమ ఉనికిని కూడా పర్చిపోయి ఆమె అందానికి ముగ్ధులై బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పాలన్న విషయాన్ని కూడా మర్చిపోతున్నారు.

హేమ కవితను విడిపించుకొని 'ప్రెజెంట్స్ విషయం ఏం చేసావన్నట్లు' చూసింది. కవిత 'నీకేం ఫర్వాలేదులే నేనున్నాగా' అంటూ కళ్లతోనే అభయం ఇచ్చింది.

ఇంతలో హేమ ఫ్రెండ్స్ కూల్‌డ్రింక్స్ తాగుతూ హేమ దగ్గరకు వచ్చి "ఏమిటి హేమా మాకేవో మంచి ప్రెజెంట్స్ ఇస్తానన్నావుగా ఏవీ?" అని అడిగారు తన ప్రతి బర్త్‌డేకూ తన ఫ్రెండ్స్‌కు ఏదో ఒకటి ప్రజెంట్ చేయడం హేమ ప్రత్యేకత క్రిందటి బర్త్‌డేకు అందరికీ ఫౌంటెన్ పెన్స్. ఈ సారి ఏమిస్తుందో అని అందరూ ఆత్రుతగా చూస్తున్నారు.

హేమ కవితవైపు చూసింది కవిత కళ్ళతోనే 'ఇప్పుడే వస్తాను' అన్నట్లు చూసి లోపలికి వెళ్ళి పెద్ద బాక్స్ తీసికొనివచ్చి ఓపెన్ చేసింది హేండ్‌బాగ్స్ ఆకుపచ్చ రంగులో మెరసిపోతున్నాయి హేమ వాటిని ఒక్కొక్కటీ తీసి అందరికీ పంచింది.

హేండ్ బాగ్స్ పరిశీలిస్తున్న ఫ్రెండ్సంతా "ఏమే కవితా హేండ్ బాగ్స్ చాలా బావున్నాయి ఎక్కడ కొన్నావే?" అని అడిగారు!

దానికి కవిత నవ్వి "కొనడమా? నాన్సెన్స్ ఇంత ఖర్చుపెట్టి ఏదైనా కొనడం నా లైఫ్‌లో వుందా? చిన్న ట్రిక్ ప్లే చేసా అంతే పైసా ఖర్చు లేకుండా ఇవన్నీ ఒళ్ళోవచ్చిపడ్డాయి" అంది.

అంతా తెల్లబోతూ "ఏమిటే ఆ ట్రిక్కు చెప్పవూ?" అన్నట్లు చూసారు! హేమ కూడా ఆశ్చర్యపోతూ కవితవైపు చూసింది ఏమి చెప్తుందో అన్నట్లు

కవిత చెప్పింది "ఏమి లేదు వెరీ సింపుల్ నిన్న ఉదయం మన నోటీసు బోర్డులో మన కాలేజ్ బ్యూటీ హేమ హేండ్‌బాగ్ పోయింది. దొరికిన వారు దయచేసి ప్రిన్సిపాల్‌గారి రూముకు తీసికొచ్చి అందజేయవలసిందిగా కోరుతున్నాము"అన్న చిన్న నోటీసు పెట్టించా అంతే సాయంత్రం ప్రిన్సిపాల్‌గారి రూముకెళ్ళేసరికి ఓ 50 హేండ్‌బేగ్‌లు టేబిల్ మీదున్నాయి" అదీ కథ అంటూ నవ్వసాగింది వాళ్ళు కూడా శృతి కలిపారు.